క్లుప్తంగా

కాపునాడు అధ్యక్షుడిగా వీరబాబు


నియామక పత్రం అందుకుంటున్న వీరబాబు

సీటీఆర్‌ఐ: రాజమహేంద్రవరం పార్లమెంట్ కాపునాడు అధ్యక్షుడిగా ముమ్మిడి వీరబాబు నియమితులయ్యారు. దేవీచౌక్‌లోని కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు గార్ల సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ఉభయ గోదావరి జిల్లాల కాపునాడు అధ్యక్షులు డాక్టర్ కోటిపల్లి వెంకట రామారావు చేతుల మీదుగా ఆయన గురువారం నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో కాపునాడు జిల్లా నాయకులు గుదే రఘు నరేష్, రాజమండ్రి సిటీ అధ్యక్షుడు విన్నా వాసు, రూరల్ అధ్యక్షుడు దేశనీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిధుల విడుదలపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ: పుష్కరాల రేవు నుంచి కొవ్వూరు వరకు ఉన్న హేవ్‌లాక్ బ్రిడ్జి సుందరీకరణపై కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పర్యాటక శాఖకు నిధులు విడుదల చేయడం హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ రూ.94.44 కోట్లు మంజూరు చేయడంతో పాటు, వాటిలో రూ.62.33 కోట్లను తక్షణమే విడుదల చేశారన్నారు. వీటితో వంతెన సుందరీకరణతో పాటు సమీపంలోని బ్రిడ్జిలంక కూడా పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: భార్య పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. హుకుంపేట డిబ్లాకులో గురువారం ఈ సంఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హుకుంపేట డిబ్లాకు గౌతమి నగర్‌కు చెందిన రాండి శివ (31) రాడ్ బెండింగ్ వర్కు చేస్తుంటాడు. నాలుగు రోజుల క్రితం భార్య వెంకటలక్ష్మితో అతడికి గొడవ జరిగింది. దీంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన శివ గురువారం మధ్యాహ్నం ఇంటిలోని సర్వేబాదుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అతడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బాలాజీపేటకు చెందిన బి.శ్రీధర్ (35) గురువారం మృతి చెందాడు. అతడు ఈ నెల 22వ తేదీన రైల్వే క్వార్టర్స్‌లో పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● అనారోగ్య సమస్యతో పురుగుమందు తాగి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట నగరానికి చెందిన దడాల అబ్బులు (63) గురువారం మృతి చెందాడు. అతడు బుధవారం పురుగుమందు తాగడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. త్రీటౌన్ ఎస్సై అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

కడియం: జాతీయ రహదారిపై బుర్రిలంక వద్ద గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన బి.త్రిమూర్తులు గాయాలపాలయ్యాడు. వేమగిరి వైపు నుంచి రావులపాలెం వైపునకు వేగంగా వెళుతున్న కారు అతడిని ఢీకొన్నట్టు స్థానికులు చెబుతున్నారు. కాగా.. గాయాల పాలైన త్రిమూర్తులును స్థానికులు 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు.

సినిమాలు



శ్యామల :	మెకానిక్ రాకీ
సూర్యమినీ :	క
సూర్యప్యాలెస్ :	మెకానిక్ రాకీ
శివజ్యోతి :	జీబ్రా
అనుశ్రీ :	రణగల్
స్వామి :	అమరన్
అశోక :	లక్కీ భాస్కర్
రాజా :	క
రంభ :	ఉద్వేగం
ఊర్వశి :	కంగువా
మేనక :	ఆదిపర్వం
కుమారి :	ఇష్క్
అప్సర :	రోటీ కపడా రొమాన్స్
నామవరం	
వీఎస్ మహల్ :	అమరన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	మెకానిక్ రాకీ
కడియం	
వెంకటసూర్య :	అమరన్

నీటి వృథా ఆగేనా!

- గోదావరి తాగునీటి పైపులైన్‌కు లీకేజీ
- వృథాగా పోతున్న సురక్షిత నీరు
- కొత్త పైపులైన్ వేసినా ఫలితం శూన్యం


కొత్త పైపులైన్ నుంచి లీకయిన నీరు

రాజమహేంద్రవరం రూరల్: సంపూర్ణ ఆరోగ్యానికి సురక్షిత తాగునీరు ఎంతో అవసరం. దాని ద్వారానే సగం వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. రాజమహేంద్రవరం పరిసర గ్రామాలకు ప్రజలు గోదావరి నీటినే తాగడానికి ఉపయోగిస్తారు. ప్రభుత్వం ఈ నీటిని శుద్ధిచేసి పైపులైన్ల ద్వారా వివిధ గ్రామాలకు పంపిస్తోంది. అయితే పైపులైన్ల లీకేజీ కారణంగా నీరు ప్రజలకు చేరకపోవడంతో కష్టమంతా నిరుపయోగంగా మారుతోంది. జాతీయ రహదారిపై హుకుంపేటలోని గోదావరి సురక్షిత మంచినీటి పథకం పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతోంది. ఆ సమస్య పరిష్కారానికి అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఉండడం లేదు.

వృథాగా పోతున్న నీరు

గోదావరి సురక్షిత మంచినీటి పథకం నుంచి హుకుంపేట తదితర గ్రామాలకు మంచినీరు పంపిణీ చేసేందుకు జాతీయ రహదారి పక్క నుంచి పైపులైను వేశారు. దీని ద్వారా రాజానగరం మండలం దివాన్ చెరువు వరకూ నీరు సరఫరా అవుతుంది. అయితే కొద్ది నెలలుగా హుకుంపేట చెరుకూరి గోడౌన్స్ వద్ద పైపులైనుకు లీకేజీ ఏర్పడి నీరంతా వృథాగా పోతోంది. దాదాపు ఆరు నెలలుగా ఈ సమస్య నెలకొంది. ప్రజలకు అందాల్సిన రక్షిత నీరంగా రోడ్డపై వృథాగా పోయేది. లీకేజీ ఎక్కడ ఏర్పడిందో కనుగొనడానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అనేక ప్రయత్నాలు చేశారు. చివరకు హుకుంపేట జాతీయ రహదారి పక్కన లీకేజీని కనిపెట్టారు.

కొత్త పైపులైన్ ఏర్పాటు

చెరుకూరి గోడౌన్స్‌కు చెందిన ప్రహరీలోని రెండు పిల్లర్ల మధ్య లీకేజీ ఏర్పడడంతో మరమ్మతులు చేయడం సాధ్యం కాదని తేల్చారు. దీంతో లీకేజీ అవుతున్న పైపులైన్‌ను వదిలేసి, కొత్త పైపులైను ఏర్పాటు చేశారు. అనంతరం బుధవారం రాత్రి నీటిని పంపి ట్రయల్ రన్ కూడా వేశారు.


హుకుంపేట జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన కొత్త పైపులైన్

గురువారం ఉదయం 10 గంటల వరకూ నీటిని వదలారు. అయితే పైపులైన్ నుంచి లీకేజీ మళ్లీ ఏర్పడి నీరంతా బయటకు పోయింది. సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. అయితే అధికారులు మాత్రం ఇది కేవలం ట్రయల్ రన్ మాత్రమేనని, లీకేజీ లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

ట్రయల్ రన్ మాత్రమే

తాగునీటి పైపులైన్ లీకేజీని సమస్య పరిష్కారం కోసం కొత్త పైపులైన్ వేశాం. ప్రస్తుతానికి ట్రయల్ రన్ ప్రారంభించాం. మళ్లీ నీరు లీకేజీ అవుతోంది. దీనిపై పూర్తిస్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం. – **అనిల్**, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ (ప్రాజెక్ట్సు)రాజమహేంద్రవరం

మూడు వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో ఎక్సైజ్ అధికారి లావణ్య, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గురువారం డ్రోన్ ద్వారా సర్వే చేపట్టి అక్రమంగా నిల్వ ఉంచిన మూడువేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య తెలిపారు. రాజమహేంద్రవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ నార్త్, సౌత్ స్టేషను పరిధిలోని బృందాలతో కలిసి గోంగూరలంక, వెంకటనగరం లంక, పిచ్చుకలంక, బొబ్బిలి లంక వద్ద డ్రోన్ ఉపయోగించి దాడులు నిర్వహించామన్నారు. సౌత్, నార్త్ స్టేషన్ల పరిధిలో 1800 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసి, 150 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే దేవరపల్లి స్టేషన్ పరిధిలో 1200 లీటర్ల బెల్లంఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా బెల్లం ఊట నిల్వలు ఉంటే సమాచారం అందించి సహకరించాలన్నారు.

చలి తీవ్రతతో అనేక సమస్యలు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు



రాజమహేంద్రవరం రూరల్: చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దగ్గు తదితర శ్వాసకోశ సమస్యలు పెరిగే అవకాశం ఉంటుందని, ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా వైద్యుల సూచనలు పాటించాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) సిబ్బంది, వైద్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. దగ్గు, చలి, శ్వాసకోశ సంబంధ వ్యాధుల లక్షణాలున్న వారిని ప్రారంభ దశలోనే గుర్తించేలా అవగాహన కల్పించామన్నారు. ప్రజలకు సత్వర చికిత్స అందజేయడంలో పాటు మెరుగైన వైద్య సేవలను సమయానికి అందించేందుకు అవసరమైన మందులు, వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. చలి తగ్గించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రోగ లక్షణాలు కనిపించినప్పుడు సమీపంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

కిల్కారి పోస్టర్ ఆవిష్కరణ

జిల్లాలోని గర్భిణులు, బాలింతలకు కిల్కారి సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె. వెంకటేశ్వరరావు సూచించారు. బొమ్మూరులోని కార్యాలయంలో గురువారం కిల్కారి సేవల పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తల్లీబిడ్డల ఆరోగ్యానికి సంబంధించి అవసరమైన సలహాలు, సూచనలను మొబైల్ ఫోన్‌లో అందజేస్తామన్నారు. కిల్కారీ సేవల్లో భాగంగా గర్భం ధరించింది మొదలు, బిడ్డకు ఏడాది వచ్చే వరకూ ప్రతి వారం ఆర్‌సీహెచ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న మొబైల్ నంబర్‌కు కాల్స్ వస్తాయన్నారు. తిరిగి మరల సందేశం వినాలంటే 14423 ఫోన్ కాల్ చేయాలన్నారు.

చందన నాగేశ్వర్ పరామర్శ


ముత్యాలును పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: భార్యావియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పసలపూడి ముత్యాలును రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఇటీవల ముత్యాలు సతీమణి పసలపూడి సత్యవేణి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ సత్యవేణి చిత్రపటానికి నమస్కరించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు రేగుళ్ల రాజు, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, ముత్యాల జాన్, గూటం రాజు, దాసరి ధర్మ ఉన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్ వర్మ

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డిసెంబర్ 14వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభ జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ పిలుపునిచ్చారు. బొమ్మూరులోని సంఘ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్ పాల్ మాట్లాడుతూ డిసెంబరు 14న తమ సంఘం జరిపే మహాసభ జిల్లా ఉద్యోగులను ఐక్యపరుస్తుందని, ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆదేశాల మేరకు డిసెంబరు 14న జేఎన్ రోడ్డులో భారీ ర్యాలీ జరపాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లా కోశాధికారి కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు కె.వెంకటరాజు, కె.దినేష్, ఎన్‌పీఎస్ రాజు, విజయ కుమార్, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

● ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ ఆవ రోడ్డు, గరకపాటి నగర్, శాంతిపురం మొదలగు ఏరియాల్లో విద్యుత్ ఉండదు.

● ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ స్టేడియం రోడ్డు, టి.నగర్, శ్యామల థియేటర్ రోడ్డు, పెద్దాడ వారి వీధి, చల్లపల్లి వారి వీధి, న్యాపతి వారి వీధి, గోదావరి గట్టు, మూడు గుళ్ల వారి వీధి, ఉడిపి అక్షయ వీధి, హోటల్ ఫుడెక్స్, అచంట వారి వీధి, మున్సిపల్ స్టేడియం ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.

● ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 వరకూ ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఓఎన్‌జీసీ, గోదావరి ఫ్లోర్ మిల్లు, అల్‌సమీ కోల్డ్ స్టోరేజ్, రెవెన్యూ కాలనీ, రాజీవ్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, పాలిటెక్నిక్ కళాశాల, గాయత్రీ నగర్, ఎంప్లాయస్ కాలనీ, ఏఎంజీ కాలేజీ, రాజవోలులో సరఫరా నిలిపివేస్తారు.

● ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొంతమూరులోని నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లిం పేట, అంబేడ్కర్‌పేట, అఫీషియల్స్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, కాతేరు రోడ్డు, బ్రాహ్మణ అగ్రహారం, బూసమ్మ కాలనీ, శ్రీరామ్ నగర్, బీసీ కాలనీ, వీవీ కొండయ్య నగర్, కాతేరులోని బ్రాహ్మణ అగ్రహారం, కొంతమూరులోని ఆరమ్ నగర్, కల్యాణ్ నగర్, ఆదర్శ నగర్, ఎంప్లాయిస్ కాలనీ, క్వారీ ఏరియా, ఫోర్త్ బ్రిడ్జి ఏరియాలలో విద్యుత్ ఉండదు.

● ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొంతమూరులోని ఎస్ఎస్ఆర్ఆర్ లేఅవుట్, సున్నంబట్టీ రోడ్డు, రాజ రాజేశ్వరి నగర్, నూకాలమ్మ ఆలయ ప్రాంతం, మెయిన్ రోడ్డు, అఫీషియల్ కాలనీ, చందన రమేష్ లే అవుట్, చెంచు కాలనీ శానిటోరియం ఏరియాలలో అంతరాయం కలుగుతుంది.

● ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ శ్రీరామ్, రాజీవ్ గాంధీ కాలేజీ ఏరియా, దుర్గానగర్, మల్లయ్య పేటలలో విద్యుత్ కోత విధిస్తారు.

● ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకూ సుబ్బారావు నగర్, సింహాచలం నగర్ ఏరియాలలో సరఫరా నిలిపివేస్తారు.

● ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జేఎన్ రోడ్డు,చెరుకూరి ఫంక్షన్ హాల్ రోడ్డు, సూర్య ఫంక్షన్ హాలు, మహాలక్ష్మి టెంపుల్ వీధులు, వేంకటేశ్వర నగర్, హ్యాపీ స్ట్రీట్, వాకర్స్ రోడ్డు, ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలలో ప్రభావం ఉంటుంది.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం


సదస్సులో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం ఏపీ పేపరుమిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మంటపంలో దైవసేవకుల సదస్సు నిర్వహించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎస్సీలు క్రైస్తవంలోకి మతం మారితే రిజర్వేషన్లు కోల్పోతారని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం దారుణమన్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. దైవ సేవలకులందరూ ఐక్యంగా ముందుకు వస్తే తాము ఉద్యమానికి సహకరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో ప్రతాప్ సిన్హా, మోతా శారద, తాడాల కొండరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కుల సాధనే లక్ష్యం కావాలి


దుళ్ల హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

కడియం: పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కుల సాధనే లక్ష్యం కావాలని పదో తరగతి విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం దుళ్ల హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థుల రాత పుస్తకాలు, ఉపాధ్యాయులు పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు సుమారు నాలుగు నెలల సమయమే ఉందన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని కోరారు. సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నూరు శాతం ఫలితాలు సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విషయ నిపుణులుగా వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమణరావు, గణపతి, పల్లి రాజు ఎస్తేరు రాణి, ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు. ఉదయం జాతీయ పతాకావిష్కరణతో ప్రారంభమైన వార్షిక తనిఖీ సాయంత్రం వరకు కొనసాగింది.

ప్రణాళికా బద్ధంగా చదవాలి

కంబాలచెరువు: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. వంకాయల వారి వీధిలోని సిటీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సీఆర్‌ఎం టీజే శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యోతిరావు ఫూలే ఆశయ సాధనకు కృషి

- పిలుపునిచ్చిన వక్తలు
- వాడవాడలా ఫూలే వర్ధంతి కార్యక్రమాలు


ఫూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మార్గాని నాగేశ్వరరావు, రౌతు సూర్యప్రకాశరావు, షర్మిలారెడ్డి, గూడూరి రాధిక, చందన నాగేశ్వర్


ఫూలే వర్ధంతిలో మాట్లాడుతున్న ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి

సీటీఆర్‌ఐ: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు కోరారు. పూలే వర్ధంతి సందర్భంగా గోదావరి గట్టున ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూల్ నివాసి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఉభయ రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీలీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో..

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్త్రీల విద్య కోసం పోరాడిన జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో అందరం నడుద్దామని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఎల్ఐసీ ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. ఏవీ అప్పారావు రోడ్డులోని ఆయన సీనియర్ డివిజన్ మేనేజర్ సంధ్యారాణి పూలమాల వేశారు. ఓబీసీ అసోసియేషన్ సెక్రటరీ విశ్వనాథ్ మాట్లాడుతూ నేడు పురుషులతో పాటు అన్ని రంగాలలో మహిళలు పురోగమిస్తున్నారంటే అది పూలే చేసిన కృషి ఫలితమేనన్నారు. ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు వీర కిషోర్ మాట్లాడుతూ కులం, మతం, మూఢ నమ్మకాలు రాజ్యం ఏలుతున్న కాలంలో పూలే చాలా ధైర్యంగా బడుగు, బలహీన వర్గాలను చైతన్యపరిచారని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ సాహు, మేనేజర్ సేల్స్ బి.శ్రీనివాస్, ఎల్ఐసీ ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సమ్మతం గన్నయ్య, ఐసీఈయూ జనరల్ సెక్రటరీ ఎం.కోదండరాం , ఈశ్వరరావు, సత్యదేవ, రమేష్ బాబు పాల్గొన్నారు.

వివక్షను రూపుమాపిన పూలే

కంబాలచెరువు: సమాజంలో కులపరమైన వివక్షను, అన్యాయాలను రూపుమాపడానికి, మహిళల హక్కుల పరిరక్షణకు జీవితాన్ని ధారపోసిన మహామనిషి జ్యోతిరావు పూలే అని ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో పూలే వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ నరసింహ కిశోర్, పోలీసు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పూలే ఆశయాల సాధన కోసం అందరూ కృషి చేయాలన్నారు.

బడుగుల ఆశాజ్యోతి

కడియం: వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా గ్రామంలోని విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు పూలే అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.


జేగురుపాడులో పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సతీష్‌చంద్ర స్టాలిన్ తదితరులు


పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్, పోలీసు అధికారులు